క్లుప్తంగా

పరిశుభ్రత అందరి బాధ్యత



డెయినేజీలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న కార్మికుడు

జగిత్యాల: పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. శనివారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సైతం పచ్చదనం పరిశుభ్రత పాటించాలని పరిసరాలను నిత్యం శుభ్రం చేసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని కోరారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఫీజుల పెంపుపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జగిత్యాల: కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల్లో పేరెంట్స్ కమిటీ అనుమతి లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వం 25 శాతం ఉచిత విద్య కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదవడానికి అని చెప్పి అధికారులు దీనిని అమలు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యా హక్కు చట్టం అమలు చేయాలన్నారు. పేరెంట్స్ కమిటీల అనుమతితోనే ఫీజులు పెంచాలని, కానీ ఎ క్కడ కూడా అలా జరగడం లేదన్నారు. ఇప్పటి కైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కో రారు. కార్యక్రమంలో కార్యదర్శి అక్రమాలిక్, రాంచంద్ర,సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ నృసింహుని సన్నిధిలో జడ్జి పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న జడ్జి

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.లావణ్య శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు జడ్జికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి ప్రసాదాలను అందించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న రాజేందర్, విద్యార్థులు

కోరుట్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల మైనారిటీ గురుకులాల రీజినల్ లెవల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ దాసరి రాజేందర్ అన్నారు. పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రగతిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండ్లు, పూల మొక్కలను నాటారు. కాలుష్య నివారణకు చెట్లు ఉపయోగ పడుతాయని పేర్కొన్నారు. చెట్ల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- డీఆర్డీ ఏపీడీ రఘువరన్

జగిత్యాలరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామపంచాయతీలో కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామాల్లో ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై సైతం ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధిహామీ పథకంలో మొక్కలు నాటి, వాటి సంరక్షణపై నిత్యం పర్యవేక్షణ ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో గంగలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ భవనం పూర్తయ్యేదెప్పుడో?

- 2023లో నిధులు మంజూరు
- ఏడాది క్రితం పనులు నిలిపేసిన వైనం
- ఎస్సారెస్పీ అనుమతులు రాక పనులు జాప్యం



పిల్లర్లు వేసి వదిలేసిన తహసీల్దార్ కార్యాలయ భవనం

కోరుట్ల రూరల్: మండల ప్రజలకు రెవెన్యూ సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పట్టణ శివారులోని ఆదర్శనగర్‌లో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లోని ఎస్సారెస్పీ క్వార్టర్ల స్థలంలో నిర్మించేందుకు నిర్ణయించారు. 2023లో నిధులు మంజూరు చేసి భూమిపూజ చేశారు. కాగా ఏడాది క్రితం పనులు ప్రారంభించినప్పటికీ పిల్లర్ల దశ వరకే పనులు చేసి వదిలేశారు. దీంతో పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం పనులు ఎప్పుడు పూర్తవుతాయో నని పట్టణ, మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

భవనానికి ఎస్సారెస్పీ నుంచి అనుమతులు లేవు

కల్లూర్ రోడ్డులోని ఎస్సారెస్పీ స్థలంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మిస్తుండగా భవన నిర్మాణానికి ఎస్సారెస్పీ నుంచి అనుమతులు రాక పనుల నిలిచిపోయాయని వాదనలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు సరిపోవని ప్రస్తుతానికి నిధులు ఉన్న మేరకే పనులు పూర్తి చేసి మిగతా నిధుల కోసం మళ్లీ ప్రతిపాదనలు పంపించి మంజూరు పొందవలసి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఉన్న నిధుల మేరకైనా పనులు చేయకుండా ఎస్సారెస్పీ అనుమతులు లేవనే సాకుతో కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు నిలిపివేయటంతో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు సాగతాయో లేదోననే అనుమానాలు తలెత్తుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎస్సారెస్పీ అనుమతులతో భవన నిర్మాణానికి కావలసిన మొత్తం నిధులు మంజూరుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రూ. 50 లక్షలు మంజూరు..

తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ. 50 లక్షలు మాత్రమే మంజూరు చేసింది. పనులు నడుస్తుండగా పూర్తి కావటానికి మిగతా నిధులు మంజూరు చేయవచ్చనే తాత్కాలికంగా రెండు విడతల కోసం రూ. 20 లక్షలు, రూ.30 లక్షలు మంజూరు చేశారు. టెండర్లు పూర్తి కాగా, స్థానిక కాంట్రాక్టర్ పనులు దక్కించుకుని ఏడాది క్రితం పనులు ప్రారంభించి పిల్లర్ల వరకు మాత్రమే పనులు చేసి వదిలేశారు.

అనుమతులు వచ్చాయి

కల్లూర్ రోడ్డులోని ఎస్సారెస్పీ స్థలంలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం కోసం సంబంధిత అధికారుల నుంచి అనుమతులు వారం క్రితం మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న రూ.50 లక్షల మేరకు పనులు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన పనికి సంబంధించిన బిల్లుల విడుదలలో జాప్యం జరిగింది. మిగతా పనులు కాంట్రాక్టర్ ఎప్పుడు పనులు ప్రారంభిస్తాడో తెలియదు.

– సుచిత్ రావు, ఏఈ, పంచాయతీరాజ్

అదృశ్యమైన బాలుడు జగిత్యాలలో ప్రత్యక్షం



తల్లిదండ్రులతో బాలుడు శ్రీకర్

ఇబ్రహీంపట్నం: మండలంలోని మూలరాంపూర్ గ్రామానికి చెందిన కందకురి శ్రీధర్–వనిత దంపతుల కుమారుడు శ్రీకర్ గురువారం మండలంలోని వేములకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలకు వెళ్తున్నానని చెప్పి అదృశ్యమయ్యాడు. బాలుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు వెతుకుతుండగా, బాలుడు శనివారం జగిత్యాల బస్టాండ్‌లో ఉండగా బంధువులు చూసి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అప్పగించారు. శ్రీకర్ 8వ తరగతి వరకు నందిమేడారం గురుకుల పాఠశాలలో చదవగా, అక్కడి స్నేహితుల వద్దకు వెళ్లేందుకు తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లి అక్కడ స్నేహితులు కలవకపోవడంతో తన దగ్గర ఉన్న డబ్బులతో లాడ్జిలో రూం తీసుకుని ఉండి మూలరాంపూర్ వచ్చేందుకు బస్ కోసం జగిత్యాల బస్టాండ్‌లో ఉండగా బంధువులు చూసి గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి శ్రీకర్‌ను అప్పగించారు.

పసుపు బోర్డు ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్ల: నిజామాబాద్‌లో ఆదివారం జరిగే జాతీయ పసుపు బోర్డు ప్రారంభానికి రావాలని బీజేపీ నాయకులు కోరుట్ల పట్టణంలో పలువురికి శనివారం ఆహ్వాన పత్రికలు అందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, బీజేపీ, బీజేవైఎం, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీజేఎస్ పోటీ

మెట్‌పల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ జన సమితి పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగోని శంకర్‌రావు స్పష్టం చేశారు. పట్టణంలో శనివారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు గాని, ఒంటరిగా గాని పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కుంట్ల ధర్మార్జున్, కంతి మోహన్‌రెడ్డి, ముక్కెర రాజు, సర్దార్ వినోద్‌కుమార్, చుక్క గంగారెడ్డి, బొజ్జ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలి

కథలాపూర్: విద్యార్థులు చదువులో అభివృద్ధి చెందడానికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు సహకరించాలని అంబారిపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కిషన్‌రావు పేర్కొన్నారు. శనివారం కథలాపూర్ మండలం అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యేలా హోంవర్క్ చేసేలా తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవితేనే విజయం

మల్లాపూర్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండే ఒక సమున్నత లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం తమ సొంతమవుతుందని ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని నడికుడ, హుస్సేన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా నోట్‌బుక్స్, సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రఘు, వంశీ, శివ, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా కుమార్

పెగడపల్లి: చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా రాగళ్ల కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామానికి చెందిన కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను ఉపాధ్యక్షుడిగా నియమించిన సహకరించిన శ్రీలక్ష్మికి, నియామకానికి సహకరించిన నాయకులకుకృతజ్ఞతలు తెలిపారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

రాయికల్: సీపీఎస్ ఉపాధ్యాయుల డీఏ బకాయిలు ప్రతి నెలా ప్రభుత్వం చెల్లించాలని టీఎస్ రాయికల్ మండల శాఖ శనివారం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. ఒకేసారి చెల్లించాల్సిన డీఏ బకాయిలు విడుదల వారిగా ఇస్తున్నందున వెంటనే పెండింగ్‌లో పెట్టకుండా ఒకేసారి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, అసోసియేట్ ప్రధాన కార్యదర్శి అభయ్‌రాజ్, బాపురావు, చిలువేరి రమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం సిద్దిపేట వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు తడుక జగదీశ్వర్ శనివారం దర్శించుకున్నారు. ముందుగా వైఎస్ఆర్ గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో వైఎస్ఆర్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం పక్షాన స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

అమిత్‌షా సభ విజయవంతం చేయాలి



మహిళా రైతులతో మాట్లాడుతున్న భోగ శ్రావణి

రాయికల్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం నిజామాబాద్ కిసాన్ సమ్మేళనం కార్యక్రమానికి హాజరవుతున్నారని, ఈ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి కోరారు. మండలంలోని వస్తాపూర్ గ్రామంలో శనివారం పసుపు రైతులు, మహిళా రైతులతో సమావేశం నిర్వహించి సభ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సాయిరాజ్, మహిళ మోర్చా నాయకురాలు సబిత, సుమన్, వేణు, గంగాధర్, అంజి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

జగిత్యాల: డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు శనివారం మాజీ కౌన్సిలర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉండేలా వెంటనే దవాఖానా ఏర్పాటు చేయాలని, అలాగే శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, డీఆర్సీ సెంటర్ ముందే శవాలు కాలుస్తున్నారని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని, వెంటనే శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే అక్కడి వారికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ప్రార్థన స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు.

పచ్చదనం పెంపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న కమిషనర్, నాయకులు

ధర్మపురి: పట్టణంలో పచ్చదనం పెంపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ధర్మపురి మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో 5వార్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ గంగాధర్, పర్యావరణ ఇంజినీర్ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, వార్డు అధికారి వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పీవీకి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ నివాళి



పీవీకి నివాళి అర్పిస్తున్న మహిళా నాయకురాళ్లు

జగిత్యాలటౌన్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి పాల్గొని పీవీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ ఆర్థిక సంస్కరణలతో దేశగతినే మార్చారని కొనియాడారు.

నిందితులకు శిక్ష పడేలా చూడాలి



సమీక్ష సమావేశంలో ఎస్పీ

జగిత్యాలక్రైం:వివిధ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా కోర్టు డ్యూటీ ఆఫీసర్లు కృషి చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో శనివారం సమీక్షించారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు పూర్తయ్యే వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలం కోర్టుకు సమర్పించడంలో బాధ్యత తీసుకోవాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్ కేసులు, వారెంట్స్, సమన్స్ అంశాలను సమీక్షించారు. సీఐలు శ్రీనివాస్, ఆరిఫ్ అలీఖాన్, రఫీక్‌ఖాన్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్రస్థాయి షూటింగ్‌లో మెడల్ సాధించిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులను ఎస్పీ అభినందించారు.

ట్రాన్స్‌కో జరదేఖో..



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని హరిజనవాడలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు చుట్టుకుని ప్రమాదకారంగా మారింది. ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సతీశ్,ఏఈ, ఇబ్రహీంపట్నం, సెల్ నంబర్: 8712486416

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రోడ్డు మంజూరు చేయాలి



మంత్రి వివేక్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఏర్పాటైన అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ (ఏటీసీ) ఐటీకి అనుబంధంగా ఉన్న కేంద్రానికి అప్రోచ్ రోడ్ బాగా లేదని, డబుల్ రోడ్డు మంజూరు చేయాలని గనులు, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్‌కు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రోచ్ రోడ్ బాగా లేకపోవడంతో అటుగా వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందని, రోడ్డు ఏర్పాటు చేస్తే ప్రజలకు బాగుంటుందన్నారు. స్పందించిన మంత్రి ఇండస్ట్రీయల్, కార్పొరేషన్ ఎండీ శశాంక్‌తో మాట్లాడి రోడ్డు మంజూరు చేయిస్తానని తెలిపారు.

పోర్చుగల్‌లో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాలటౌన్: పోర్చుగల్ దేశంలో పలు ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ శనివారం కోరారు. పోర్చుగల్ దేశంలోని ఎఫ్అండ్‌బీ మేనేజర్, హౌజ్ కీపింగ్ సూపర్‌వైజర్, హౌజ్‌కీపర్, వెయిటర్, మెయింటెనెన్స్ టెక్నిషియన్, ఎక్సుక్యూటీవ్ చెఫ్, కుక్, కిచెన్ అసిస్టెంట్ (డిష్‌వాషర్), సేల్స్ ఎక్స్‌క్యూటీవ్, ఈవెంట్ కోఆర్డినేటర్, స్పాతెరపిస్టు ఉద్యోగ ఖాళీలున్నాయని తెలిపారు. విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను tomcom.resume@ gmail.com కు పంపాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం టామ్‌కాం వారి 94400 52592, 9440049937, 9440051452నంబర్లలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీ



జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద ఐదు విద్యుత్ మోటార్లను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన అత్తినేని గంగాధర్, రౌతు శేఖర్, దావ శంకర్, కొల్లూరి రవీందర్, అత్తినేని గంగన్నకు చెందిన పొలాల వద్దనున్న విద్యుత్ మోటార్లు గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో పంటలకు నీరు పెట్టేందుకు మోటార్లు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరకట్నం కేసు నమోదు

మల్యాల: మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన నులిగొండ సుప్రియ భర్త వరకట్నం కోసం వేధిస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం మల్యాల మండలం నూకపల్లి గ్రామానికి చెందిన నులిగొండ సుప్రియకు జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన గంగ మహేశ్‌తో వివాహం జరిగింది. కొద్దిరోజులుగా భర్త మహేశ్ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో శనివారం బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హెచ్ఎం శకుంతలదేవి సేవలు మరువలేనివి

మల్లాపూర్: ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శకుంతలదేవి సేవలు మరువలేనివని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, ఎంఈవో దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన హెచ్ఎం శకుంతలదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని ఆమెను సన్మానించారు. శకుంతలదేవి ఉపాధ్యాయురాలిగా వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రమోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రేషన్ పంపిణీ

కోరుట్ల రూరల్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఉమాపతి అన్నారు. పట్టణంలోని రేషన్ దుకాణాలను జిల్లా పౌర సరఫరాల అధికారి ఉమాపతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల్లో మిగిలి ఉన్న సరుకులను త్వరగా సరఫరా చేయాలని ఆదేశించారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని, సరైన సమయంలో 3 నెలల సరుకులు పంపిణీ చేయాలని సూచించారు.

మెహందీ వేడుకలు



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ఆషాడమాసం పురస్కరించుకుని మెహంది వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల డిజైన్లతో మెహందీ పెట్టుకుని సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆషాడమాసం సందర్భంగా శనివారం విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.